

గొలిదొడ్డిలోని ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించిన జోనల్ నోడల్ అధికారి విజయేంద్ర



మాదాపూర్‌లో.. కేంద్రం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్



మియాపూర్ కేంద్రం వద్ద బారులుదీరిన మహిళలు

‘ప్రజాపాలన’ ప్రారంభం

- ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ
- పరిశీలించిన శేరిలింగంపల్లి జోన్ నోడల్ ఆఫీసర్ విజయేంద్రబోయి

శేరిలింగంపల్లి జోన్ బృందం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో గురువారం ప్రారంభమైంది. జంట సర్కిళ్లలోని ఏడు డివిజన్ల పరిధిలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి ప్రజాపాలన నోడల్ అధికారి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్రబోయి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, జంట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు పరిశీలించారు.

28 కేంద్రాలలో దరఖాస్తుల స్వీకరణ

- శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలోని ఒక్కో డివిజన్‌లో 4 కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- మొత్తం ఏడు డివిజన్లలో 28 కేంద్రాలలో దరఖాస్తులను అందుబాటులో ఉంచారు.
- కేంద్రంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు, దరఖాస్తుల స్వీకరణ తర్వాత ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వడం జరుగుతోంది. దరఖాస్తులు ఉంటేనే పోలీసులు లోపలకు అనుమతిస్తున్నారు.
- తారానగర్ ప్రజాపాలన కేంద్రంలో మూడు రోజులపాటు ఒక కాలనీకి, ఆ తర్వాత మరో కాలనీకి అవకాశం ఇవ్వడంతో కార్యక్రమం ప్రశాంతంగా సాగుతోంది.
- శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలు కేంద్రాలను వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలించారు.

గొలిదొడ్డి కేంద్రాన్ని పరిశీలించిన నోడల్ అధికారి, కార్పొరేటర్

- గచ్చిబౌలి డివిజన్‌లోని గొలిదొడ్డి వార్డు కార్యాలయం, నల్లగండ్లలోని మహిళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలను శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ ప్రజాపాలన నోడల్ అధికారి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్ర, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

కేంద్రాలను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రజాపాలన కేంద్రాలను కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఆరు గ్యారెంటీలను అందిస్తామన్నారు.

పటాన్‌చెరు డివిజన్ పరిధిలో..

పటాన్‌చెరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో భాగంగా మొదటిరోజైన గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ పాల్గొన్నారు.



గొలిదొడ్డి కేంద్రంలో దరఖాస్తులు అందిస్తున్న ప్రజలు



ఆల్విన్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి డివిజన్‌లో.. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



నడిగడ్డ తండాలో..

మొదటిరోజు 18,051 దరఖాస్తులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో మొదటిరోజు మొత్తం 18,051 దరఖాస్తులు వచ్చాయని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆరు గ్యారంటీల దరఖాస్తుల విషయంలో దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రజాపాలన కేంద్రంలో అవసరమైన మేర దరఖాస్తులను అందుబాటులో ఉంచామని, కాలనీలకు కేటాయించిన రోజు కేంద్రాలకు వస్తే ఎలాంటి సమస్యలు లేకుండా దరఖాస్తులు పొందవచ్చన్నారు. షెడ్యూల్ ప్రకారం అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చందానగర్ సర్కిల్ పరిధిలో హౌజ్ హోల్డ్స్ 4,015 ఉండగా 4,776 దరఖాస్తులు మొత్తం స్వీకరించగా 1,202 ఇతర దరఖాస్తులు కూడా వచ్చాయని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో 5,300 హౌజ్‌హోల్డ్స్ ఉండగా 4,750 మొత్తం దరఖాస్తులు వచ్చాయని, 283 ఇతర దరఖాస్తులు ఉన్నాయని ఆయన తెలిపారు. మొదటిరోజు పలు ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేశామన్నారు.



మియాపూర్‌లో.. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీఐ ప్రేమ్ కుమార్ తదితరులు

పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా..



నా భర్త నర్సింహులు చనిపోయాడు. మాది చందానగర్ వేముకుంట ప్రాంతం. నా భర్త పెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకోవడానికి వచ్చాను. ఆఫీ సర్లు ఇప్పిస్తరని నమ్మకముంది.

–రూకమ్మ, వేముకుంట చందానగర్

సమస్య–పరిష్కారం.. విజయానికి సోపానం

- ఎన్‌ఐటీ రూర్కెలా ప్రొఫెసర్ సింగం జయంతు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సింగం జయంతు

పటాన్‌చెరు టౌన్: సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు చూపగలగడం విజయానికి తొలిమెట్టు అని ఎన్‌ఐటీ రూర్కెలాలోని మైనింగ్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ సింగం జయంతు అభివర్ణించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'వాలుల స్థిరత్వంపై జియోటెక్నికల్ పరిశోధన' అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఓ సమస్యను పరిష్కరించాలనే ఉమ్మడి లక్ష్యంతో, దానిని ఓ ప్రాజెక్టుగా విద్యార్థులు చేపట్టి, వినూత్న పరిష్కారాలతో అద్భుత ఫలితాలను సాధించవచ్చన్నారు. గనులు తవ్వేటప్పుడు వచ్చిన మట్టి, వ్యర్థాలతో ఫ్లైయాష్‌ను కూడా 3:1 నిష్పత్తిలో కలిపి, వాటిని పూడ్చడానికి వాడాలన్నారు.దానిని బాగా చదును చేయడంతో పాటు రెండు మీటర్ల పై పొరను సారవంతమైన మట్టితో నింపితే, వ్యవసాయం చేసి, పంటలు పండించొచ్చని ప్రొఫెసర్ సింగం తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించిన జగదీశ్వర్‌గౌడ్ తదితరులు



కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన నర్సింహారెడ్డి, నాయకులు

శేరిలింగంపల్లి: దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కాంగ్రెస్ పాత్ర కీలకమని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ, కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శేరిలింగంపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలను తీర్చడంతో పాటు దేశాన్ని పటిష్టం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల సేవలు మరవలేనివని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో డివిజన్ అధ్యక్షుడు,ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... మాజీ ప్రధాని నెహ్రూ, ఇందిరాగాంధీ పటాన్‌చెరు ప్రాంతానికి బీహెచ్‌ఎల్, బీడీఎల్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తదితర పరిశ్రమలు తెచ్చి లక్షలాదిమందికి ఉపాధి కల్పించరని గుర్తు చేశారు .కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి,నాయకులు పట్టణ ఉపాధ్యక్షులు మదాస్ శేఖర్, యువరాజ్ మోరే,న్యాయవాది రంగారావు,నాయకులు హమీద్ పాషా ,ఆసిఫ్, కుంచాల కిషన్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 12 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందులో ఒకరికి పాజిటివ్ నిర్ధారణ అయిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.అదేవిధంగా 10 మందికి ఆర్టిపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

పెన్షన్ తీసుకుంటున్న వారు మళ్లీ దరఖాస్తు చేయొద్దు

పటాన్‌చెరు: ఇప్పుడు పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అమీన్‌పూర్ పట్టణంలో అన్ని వార్డుల్లో ప్రజాపాలనకు తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. వార్డుల వారీగా ఏర్పాటైన కేంద్రాల్లో నిర్ణీత ప్రొఫార్మాలో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రజాపాలన నిరంతరంగా ఉంటుందన్నారు. అలాగే ఇతర పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పీజేఆర్ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కార్మిక రంగానికి పీజేఆర్ చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి, కార్మిక నాయకులు దివంగత పి.జనార్దన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామ పరిధిలోని కిర్బి పరిశ్రమ ఆవరణలో బీఆర్‌ఎస్ పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీజేఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, పరిశ్రమ ఎండి ఫిలిప్స్, పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ రాజమహేందర్, బీఆర్‌టీయు రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, పాశమైలారం గ్రామ సర్పంచ్ కృష్ణ, కార్మిక విభాగం నాయకులు మాధవరావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

‘మనూ’- ‘ఒమేగా’ ఆస్పత్రి హైదరాబాద్ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో వీసీ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్, ఒమేగా ఆస్పత్రుల సీఈఓ నమ్రత, ఇతర అధికారులు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంతో ఒమేగా ఆస్పత్రులు హైదరాబాద్‌తో ఓ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఉర్దూ విశ్వవిద్యాలయంలో కొత్తగా ప్రారంభించిన పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులు, ఒకేషనల్ కోర్సులైన మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ, మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ కోసం ఈ ఒప్పందం చేసుకున్నారు. కాగా ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఒమేగా ఆస్పత్రులతో కలిసి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను కూడా ప్రారంభిస్తోంది. ఈ ఒప్పందంపై ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఒమేగా ఆస్పత్రుల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కమ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి హెచ్ నమ్రతలు ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా నమ్రత మాట్లాడుతూ న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్టులకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు, న్యూక్లియర్ మెడిసిన్‌లో పీజీ కోర్సును ప్రారంభించాలని ఆమె సూచించారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ బీవోక్ నర్సింగ్ కోర్సును ప్రారంభించడంలో ఒమేగా ఆస్పత్రులతో కలిసి ముందుకు సాగుతామన్నారు.

అలరించిన కీర్తనలు, నృత్య ప్రదర్శన





మాదాపూర్: కళాకారులు భరతనాట్యం, భక్తిపాటలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో భాగంగా గురువారం ఆంఫీ థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. నందిని(యూకే), నిత్యారెడ్డి (కాలిఫోర్నియా), ముస్కు భరద్వాజ్ (చెన్నై), యతీశ్వర సాయి (న్యూయార్క్), మహాలక్ష్మిలు గురువు శిరీష దేవులపల్లితో కలసి భక్తిపాటలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. వయోలిన్ ఫణిబాల, మృదంగం శ్రీనివాస్‌లు సంగీత సహకారాన్ని అందించారు. బెంగుళూరు నుంచి వచ్చిన నాట్యగురువు రేష్మ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. కళాకారులు సాయి నిషిక, దర్శిక పాల్గొన్నారు.

మదీనాగూడలో కేంద్రం ఏర్పాటుకు వినతి



జడ్సీ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు మహేష్ యాదవ్

హఫీజ్‌పేట్ : మదీనాగూడలో ప్రజాపాలన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ గురువారం జడ్సీకి వినతిపత్రం అందించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఓల్డ్ హఫీజ్‌పేట్ వార్డు కార్యాలయంను మహేష్ యాదవ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం రోజు ప్రజలకు సరిపడా దరఖాస్తులు లేవని జడ్సీకి ఫిర్యాదు చేశామన్నారు. అన్ని కేంద్రాలలో దరఖాస్తుల ఫారంలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాబురెడ్డి, రవి ముదిరాజ్, అశోక్ నాయి, మహమ్మద్ సలీం, రాజ్‌కుమార్, బాబు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ



హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి మండలం హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 108 వాహనాన్ని ప్రోగ్రాం మేనేజర్ వసంత్ పాపయ్య, ఎగ్జిక్యూటివ్ అధికారి రమేష్‌లు గురువారం తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న మందులను, యంత్ర పరికరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.

కేలండర్ ఆవిష్కరణ



హఫీజ్‌పేట్ : చందానగర్ ఆర్య వైశ్య సంఘం నూతన ఆంగ్ల సంవత్సరం 2024 కేలెండర్‌ను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ గురువారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పబ్బా మల్లేష్ గుప్త, పసుమర్తి శ్రీనివాస్, కరుపకుల సంపత్‌కుమార్, బర్గు జయకృష్ణ, పబ్బా శ్రీనివాస్, వళ్ళల శ్రీధర్, కేవీ గుప్త, సాంబమూర్తి, తల్లం శేషగిరిరావు, సంక మోహన్‌రావు, పెరుమాళ్ సుబ్రమణ్యం, పిన్నల్ వేణు తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్‌సీలో ‘మనూ’ విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గం: బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(బీపీఎస్‌సీ) టీచర్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్ (టీఆర్‌ఈ)లో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విద్యార్థులు సత్తా చాటారని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు. ఒకేసారి ఈ విభాగానికి చెందిన 180 మందికిపైగా విద్యార్థులు పీహెచ్‌డీ, ఉర్దూ, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, లాంగ్వేజెస్ వంటి సబ్జెక్టులలో టీచింగ్ పోస్టులకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. సీనియర్ సెకండరీలో ఉర్దూ సబ్జెక్టుకు మహ్మద్ షాహిద్‌రజా ప్రథమస్థానం సాధించారన్నారు. టీచింగ్ ఫ్యాకల్టీ విద్యార్థులను అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ




కుర్చీలను అందజేసిన కాంగ్రెస్ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్, విద్యాకల్పన తదితరులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు ఉప్పల ఏకాంత్‌గౌడ్, విద్యాకల్పనలు వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్ వీకర్ సెక్షన్ అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు గురువారం ఉచితంగా కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్నాటి అశోక్, జితేందర్, వెంకటస్వామి సాగర్, యాదగిరి, దయాకర్ రెడ్డి, బొట్టు శ్రీను, హనుమంతు, వినోద్, వెంకన్న, శృతి గౌడ్, షాలిని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

- ఎంఈఓ రాథోడ్



బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించిన సీఆర్పీ

పటాన్‌చెరు టౌన్: ఐదు నుంచి పద్దెనిమిదేళ్లలోపు పిల్లలు బడుల్లోనే ఉండాలని పటాన్‌చెరు ఎంఈఓ పీపీ రాథోడ్ అన్నారు. బడి బయట పిల్లల సర్వేలో భాగంగా గురువారం సీఆర్పి భాస్కర్ పట్టణంలో సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా పటాన్‌చెరు పట్టణం జేపీ కాలనీకి నిజామాబాద్ నుంచి వలస వచ్చిన ఇద్దరు పిల్లలను గుర్తించి అందులో ఒకరిని తొమ్మిదవ తరగతి, మరొకరిని ఆరవ తరగతిలో జెడ్పిహెచ్‌ఎస్ బాలుర ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బడి బయట పిల్లల సర్వే జనవరి 10వ తేదీ వరకు జరుగుతుందన్నారు.

ముగిసిన మండల పూజా మహోత్సవాలు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి మండల పూజా మహోత్సవాలు ముగిశాయి. గత 41 రోజులుగా ఈ ఆలయంలో నిత్యం పడిపూజతో పాటు స్వాములకు మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం అల్పాహారం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఆలయంలో మహా పడిపూజ, అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు.

వేడుకగా పల్లకీ సేవ

ఫిలింనగర్: వినాయకనగర్ పర్వాంతజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి పల్లకీ సేవ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పల్లకీ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు బాబురావు, రామకృష్ణారెడ్డి, సాయి రెడ్డి, శంకర్, రవి నాయక్, పురుషోత్తం, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.